బిపిని అదుపులో ఉంచుకోవడం అవసరం

ప్రజాశక్తి-నల్లజర్ల

బిపిని అదుపులో ఉంచుకోవడం ఎంతో అవసరమని నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ మహ్మద్ సిరాజుద్దీన్ తెలిపారు. బుధవారం వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా ఆయన పలు విషయాలను వివరించారు. బిపి 120/80 ఎంఎంహెచ్‌జి కన్నా అధికంగా ఉంటే రక్త పోటుగా పరిగణిస్తారన్నారు. జన్యుపరమైన, ఒత్తిడి ఎక్కువగా ఉన్న వారికి ఎపినాఫ్రిన్ అనే హార్మోన్ విడుదల అవుతుందని, ఇది రక్త నాళాల వెడల్పు తగ్గిస్తూ ఉంటుందని తెలిపారు. దీని వలన రక్తపోటు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. సోడియం ఎక్కువగా ఉన్న ఉప్పు, పచ్చళ్లు, ఆరుబయట ఆహారం తక్కువగా తీసుకోవాలని, పొటాషియం ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, ధూమపానం, మద్యపానం వంటి వాటికి దూరంగా ఉండాలని, శరీర బరువును తగ్గించుకోవాలన్నారు.

మాతృ వందన యోజనేదీ..

- వేధిస్తున్న సాంకేతిక సమస్యలు
- నగదు కోసం గర్భిణుల నిరీక్షణ
- జిల్లాలో 16 వేల మంది లబ్ధిదారులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

మాత వందన యోజన కార్యక్రమం జిల్లాలో నత్తనడకన సాగుతోంది. మాతాశిశు మరణాలు తగ్గించడంతో పాటు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రధానమంత్రి మాత వందన యోజన (పిఎంఎంవివై) అమలు చేస్తున్నాయి. గర్భిణులు, బాలింతలు, బిడ్డలకు పౌష్టికాహారం, టీకాలు, మందులకు అవసరమైన నగదు వారి బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. ఉమ్మడి జిల్లాలో కాకినాడ రాజమహేంద్రవరం జిజిఎచ్‌లతోపాటు, 7 ఏరియా ఆస్పత్రులు, 27 సిహెచ్‌సిలు, 128 పిహెచ్‌సిలు ఉన్నాయి. ప్రైవేట్ ఆసుపత్రితో కలిపి ప్రతి నెలా జిల్లావ్యాప్తంగా సుమారు 40,000 కాన్పులు జరుగుతాయని తెలుస్తోంది. జిల్లాలో సుమారు 16 వేల మంది ఈ పథకం లబ్ధి కోసం ఎదురుచూస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

వేధిస్తున్న సాంకేతిక సమస్యలు

మహిళలకు వివాహమయ్యే వరకు పుట్టింటి పేరే ఉంటుంది. వివాహ అనంతరం పేరు మారుతుంది. అయితే ఆధార్ కార్డులోనూ పాత పేరే ఉండటంతో సమస్య ఎదురవుతోంది. కొందరు మనుగడలో లేని బ్యాంకు ఖాతా నంబర్లు ఇస్తున్నారు. ఆధార్, ఫోన్ నెంబర్ అనుసంధానం కావాలి. ఇకవైసి పూర్తి కావాలి. ప్రసవానికి పుట్టింటికి వస్తారు. ఈ సమయంలో వివరాలు నమోదు కావడం లేదు. ఎఎన్‌ఎంలకు సమాచారం ఇవ్వకపోవడం, వారు అడిగిన వివరాలు పూర్తిగా సమర్పించకపోయినా సాయానికి దూరమవుతున్నారు. సుమారు 20 శాతం మందికి అసలు ఈ పథకం ఉన్నట్లే సమాచారం లేదు.

పథకం అమలు ఇలా

ప్రధానమంత్రి మాత వందన యోజన 2017 జనవరి 1 నుంచి



ప్రారంభమైంది. ఈ పథకం కింద గ్రామీణ గర్భిణులకు మొదటి కాన్పునకు రూ.6 వేలు, నగర వాసులకు రూ.5,600 ఇవ్వాలి. ఇప్పటి వరకు జిల్లాలో 1.10 లక్షల మందికి ఈ పథక ఫలాలు అందించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గడిచిన ఆరు నెలలుగా ఎఎన్‌ఎంలు, పారా మెడికల్ సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు కోవిడ్ విధుల్లో తలమునకలై ఉండటంతో గర్భిణుల వివరాలు ఆన్‌లైన్ చేయలేదు. కొందరి వివరాలు ఆన్‌లైన్ చేసినా డబ్బులు జమ కాలేదని చెబుతున్నారు.

విడతల వారీగా సాయం ఇలా..

గర్భం దాల్చిన 12 వారాల్లోగా పేరు నమోదు చేసుకుంటే రూ.1000 ఇస్తారు. అనంతరం 7 నెలల్లోగా టిటి రెండు డోసులు, 200 ఐరన్ మాత్రలు వేసుకోవడం పూర్తయితే రూ.2 వేలు అందిస్తారు. పట్టణ ప్రాంతాల్లో మహిళలు ప్రభుత్వాసుపత్రిలో ప్రసవిస్తే రూ.600, గ్రామీణ మహిళలకు రూ.1,000 చొప్పున ఇస్తారు. అనంతరం పుట్టిన బిడ్డ జీరో డోసుతో మొదలుకొని నెలవారీ టీకాలు పెంటావాలెంట్ 3 డోసులు పూర్తయితే వారి ఖాతాలో రూ.2 వేలు జమ చేస్తారు. ప్రభుత్వం సాయాన్ని నాలుగు విడతలుగా చెల్లిస్తుంది. మొదటి, రెండు, నాలుగు విడతల బాధ్యత ఎఎన్‌ఎంలు చూస్తారు. మూడో విడత బాధ్యత ఆస్పత్రి అధికారులు పరిధిలో ఉంటుంది ఏ విడత రిజిస్ట్రేషన్ పూర్తయితే ఆ మేరకే డబ్బులు జమవుతాయి.

పథకాల అమల్లో ముందంజ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

సిఎం వైఎస్.జగన్ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల అమల్లో జిల్లా యంత్రాంగం సఫలీకతమైందని ఇన్‌ఛార్జి మంత్రి, బిసి సంక్షేమ శాఖ మంత్రి సిహెచ్.వేణుగోపాల కృష్ణ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం ఉదయం జిల్లా సమీక్షా కమిటీ సమావేశం, జిల్లా స్థాయి అసైన్మెంట్ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. తొమ్మిది అంశాల అజెండాగా ఉపాధిహామీ, విద్య నాడు - నేడు, హౌసింగ్, పౌర సరఫరాలు ధాన్యం సేకరణ, వ్యవసాయం, హార్టికల్చర్, మైక్రో ఇరిగేషన్, వైద్యారోగ్యం అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో జిల్లాలో చేపట్టి అమలు చేస్తున్న పలు అభివద్ధి అంశాలపై నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో 3.20 లక్షల మెట్రిక్ టన్నుల్లో జిల్లా యంత్రాంగం రెండు లక్షల మెట్రిక్ టన్నులు సేకరించడం పట్ల జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ఈ ఏడాది రబీలో మెరుగైన దిగుబడి వచ్చిందని, అకాల వర్షాల కారణంగా కొంత ఇబ్బంది పరిస్థితి ఏర్పడినా, ప్రభుత్వం తీసుకున్న చర్యల, జిల్లా యంత్రాంగం ద్వారా ఇప్పటి వరకూ జిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. జిల్లాలో 100 రోజుల కనీస పని దినాలు కల్పించడం కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి మరింతగా పనిదినాలు కల్పించాలని మంత్రి వేణు సూచించారు.

ప్రాధాన్యత భవనాల కింద 390 గ్రామ సచివాలయాలను రూ.150.20 కోట్లతో 327 పూర్తి చేశామని, 61 ప్రగతిలో ఉన్నట్లు తెలిపారు. ఆర్‌బికెలు, వైయస్ఆర్ హెల్త్ క్లినిక్స్, డిజిటల్ లైబ్రరీ, బల్క్ మిల్క్ యూనిట్స్ భవనాల వివరాలు తెలిపారు. మిగిలిన భవనాల నిర్మాణం పనులు పూర్తి చెయ్యాలని మంత్రి ఆదేశించారు. ఐఐటిలో చేరే వారిలో కొందరు డ్రాపౌట్ అవుతున్నారని, వారిలో నైపుణ్య బోధన పద్ధతులను ఆచరించాలని పేర్కొన్నారు.

నాడు నేడు పనులకు సంబంధించిన పెండింగ్ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని మంత్రి వేణుగోపాల్ ఆదేశించారు. జూన్ 11 లోగా పనులు పూర్తి చేసి, 3వ దశకు చెందిన 406 పనులకు సంబంధించి వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందచేసిన కంప్యూటర్ వినియోగంపై దష్టి పెట్టాలని, ప్రతి విద్యార్థి ఆమేరకు ఎంత మంది వాడుతున్నారో డేటా ఇవ్వాలని ఆదేశించారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య విధానంను ప్రజల్లోకి విస్తతంగా తీసుకుని వెళ్ళాలని తెలిపారు.

సమావేశంలో పాల్గొన్న మంత్రి, కలెక్టర్, ఎంపీ, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు

జిల్లాలో 68,074 ఇంటి నిర్మాణాలు లక్ష్యం కాగా, 58,916 నిర్మాణాలు ప్రారంభించి, 17571 పూర్తి చేశామని మంత్రి వేణుగోపాల్ కష్ణ తెలిపారు. గహ నిర్మాణానికి గుర్తించిన కాంట్రాక్టర్ల ద్వారా చేపట్టిన పనుల వేగవంతం చేయాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ కోరారు.

జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ మాట్లాడుతూ, 51 వేల హెక్టార్లలో కోతలు పూర్తి చేశారని తెలిపారు. జిల్లాలో 93 శాతం కోతలు పూర్తి అయ్యాయని, ఇప్పటి వరకు ప్రభుత్వం 1.98 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ, బహిరంగ మార్కెట్‌లో 1.22 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం ఇస్తోందని, ఆమేరకు యంత్ర సేవా పథకం అమలులో మరింత నిబద్దత చూపాల్సి ఉంటుందని, ఆ మేరకు రైతుకు అవగాహన అవసరమని మంత్రి వేణుగోపాల కష్ణ తెలిపారు. ఇరిగేషన్ శాఖ తరపున కాటన్ బ్యారేజి ఆధునికీకరణ పనుల కోసం రూ.62 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు.

రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ 2023-24 కి సంబంధించి ఉపాధిహామీ పథకం అమలులో ఉపాధిహామీ కింద చేపట్టనున్న పనులకు సంబంధించి సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, రాజానగరం మండలంలో అమత్ సరోవర్ కింద చెరువుల అభివద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. సభ్యులు సూచించిన ప్రతిపాదనలు, సూచనలు పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. స్కూల్స్ ప్రారంభించే నాటికి పుస్తకాలు, ఇతర అనుబంధ మెటీరియల్ విద్యార్థులకు చేరేలా చూడాలని ఎంఎల్‌సి ఇళ్ళ వెంకటేశ్వర రావు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు, ఎంఎల్‌ఎలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, జ్యోతుల చంటిబాబు, ఎంఎల్‌సిలు బి.ఇజ్రాయెల్ వంకా రవీంద్రనాద్, అనంత ఉదయభాస్కర్, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ ఎస్.మణికుమారి, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, డిఆర్‌ఒ జి.నరసింహులు, ఆర్‌డిఒలు ఎ.చైత్రవర్షిణి, ఎస్.మల్లిబాబు, డ్వామా పీడీ జిఎస్.రామగోపాల్, పంచాయితీ రాజ్ ఎస్ఇ ఎబివి.ప్రసాద్, డిఇఒ ఎస్.అబ్రహం, జిల్లా హౌసింగ్ అధికారి జి.పరశు రామ్, ఇన్‌ఛార్జి డిఎస్ఇ పి.ప్రసాదరావు, జిల్లా వ్యవసాయ శాఖధికారి ఎస్.మాధవరావు, జిల్లా హార్టికల్చర్ అధికారి వి. రాధాకృష్ణ పాల్గొన్నారు.

దళిత శ్మశాన వాటిక ఆక్రమణ

ప్రజాశక్తి-నిడదవోలు

పట్టణంలోని సుబ్బరాజుపేటలో ఉన్న దళిత స్మశాన వాటిక ఆక్రమణకు గురయ్యిందని, దాన్ని వెంటనే సర్వే చేసి ఆక్రమణాలను తొలగించి చట్టబద్ధత కలిగించాలని పలువురు దళిత నాయకులు డిమాండ్ చేశారున. బుధవారం ఎబిఎస్ టౌన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో దళిత నాయకులు పాతూరు సుబ్బారావు మాట్లాడారు. సుబ్బరాజుపేట ప్రజలు శ్మశానానికి మతదేహాలను ఖననం చేయడానికి వెళ్లేటప్పుడు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రోడ్డు సౌకర్యం కల్పించి విద్యుత్ స్తంభాలు వేసి మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఒక షెడ్డు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రం అందించిన ప్రయోజనం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందన ఈ కార్యక్రమంలో అనేకసార్లు ఫిర్యాదులు చేశామని తెలిపారు. బిఎస్‌పి సీనియర్ నాయకులు అంబటి పుల్లారావు మరియు వివిధ దళిత సంఘాలు పాల్గొన్నారు.

వీరేశలింగం ఆస్తులు విద్యా సంస్థలకే చెందాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వీరేశలింగం విద్యాసంస్థల ఆస్తులు ఆయన వీలునామా ప్రకారం విద్యా సంస్థలకే చెందాలని, మార్కెట్ అవసరాలకు వినియోగించరాదని ఎంఎల్‌సి ఐవి సూచించారు. డిఆర్‌సి సమావేశంలో ఆయన పలు సమస్యలను సమావేశం దష్టికి తీసుకొచ్చారు. విద్యాసంస్థలకు అవసరమైన కేటాయింపులు చేసి మిగతాది మార్కెట్ అవసరాలకు వినియోగించాలని ట్రస్ట్ కమిటీ నిర్ణయంపైన, ఎండోమెంట్ అధికారులు ఆవిధంగా సర్వే చేసి నివేదిక పంపాలనే ఆదేశాలు అనుమానాలకు ఆస్కారమిస్తోందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అలా జరగడానికి వీల్లేదని ఐవి అన్నారు. దీనిపై నివేదిక పంపినట్లు కలెక్టర్ చెప్పగా మంత్రి ఆస్తులు విద్యాసంస్థలకి చెందేటట్లు చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థుల పుస్తకాలు, కిట్స్ మోసి విని పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లతో చేయించరాదని, అవసరమైనప్పుడు మాత్రమే వారి సేవలు వినియోగించుకోవాలని, ఉదయం నుంచి రాత్రి వరకు దిగుమతి కేంద్రంలోనే అందుబాటులో ఉండాలనేది. సరికాదని, చేసిన పనికి వారికి పారితోషకం చెల్లించాలని కోరారు. గోకవరంలో దేవీచౌక్ సమీపంలో రాణా సెంటరు వంతెన సుమారు 114 సంవత్సరాల పురాతనమైనదని, ఈ వంతెనను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా తక్షణ నిర్మాణం చేయాలని సభ దష్టికి తీసుకు వచ్చారు. పదవ తరగతి ఫలితాలకు సంబంధించి టార్గెట్లు నిర్ణయించడం సరికాదని రాష్ట్రమంతా, జిల్లాల్లో, మండలాల్లో ఒకే పద్ధతిలో పరీక్షలు జరగడం లేదన్నారు.

మంత్రి వనితను కలిసిన డిఐజి

హోమ్ మంత్రిని కలిసిన డిఐజి

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

ఏలూరు రేంజ్ డిఐజీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జివిజి.అశోక్ కుమార్ రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనితను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం అందించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పోలీసుల బదిలీల్లో అశోక్ కుమార్ విజయవాడ నుంచి బదిలీపై ఏలూరు రేంజ్ డిఐజిగా వచ్చారు.

10వ రోజుకు వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-కడియం

కడియం శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా వేసవి విజ్ఞాన శిబిరం బుధవారం 10వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం బి.సునీత మాట్లాడుతూ వేసవి వడగాల్పులు తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం బాలలతో నీతి కథలు చదివించారు.

ధారవరంలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

ప్రజాశక్తి చాగల్లు

మండలంలోని ధారవరం గ్రామంలో పిహెచ్ వైద్యాధికారి డాక్టర్ పిఆర్‌ఎల్.దేవి ఆధ్వర్యంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసి వైద్య సలహాలు అందించారు.

కడియం టిడిపి నేతలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-కడియం

వేమగిరిలో ఈ నెల 27 28 తేదీల్లో జరిగే మహానాడు కార్యక్రమానికి సంబంధించి రాష్ట్ర కమిటీలో కడియం టిడిపి నేతలకు ప్రాధాన్యత దక్కింది. టిడిపి సీనియర్ నేతలు అన్నందేవుల చంటి, మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి ప్రసాద్, గంగుమళ్ల సత్యనారాయణ, వెలుగుబంటి రఘురామ్, చెల్లుబోయిన శ్రీనివాస్ తదితర టిడిపి నేతలకు ప్రాధాన్యత దక్కింది. మహిళా నేతలు బండి నాగమణి, ముత్తాబత్తుల విజయకుమారికి చోటు కల్పించారు.

విద్యార్థులకు అల్పాహారం

ప్రజాశక్తి-తాళ్లపూడి

మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో తాళ్లపూడిలోని శ్రీ విజేత పబ్లిక్ స్కూల్లో సమ్మర్ క్లాసుల్లో చిన్నారులకు గోకవరపు బాబులు బుధవారం అల్పాహారం అందజేశారు. మండలంలో పదవ తరగతి పరీక్షల్లో 562 మార్కులు సాధించిన యండపల్లి పవన్ సాయికి రూ.1500 నగదు, మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా శాఖ రీజనల్ డైరెక్టర్ చంద్రయ్య, విజేత స్కూల్ హెచ్‌ఎం జెవి.ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ జయంత్యుత్సవాలకు జవహర్

ప్రజాశక్తి - చాగల్లు

మాజీ మంత్రి, టిడిపి రాజమహేంద్రవరం పార్లమెంటరీ అధ్యక్షులు కెఎస్.జవహర్ ఈ నెల 19న శుక్రవారం దుబాయిలో ఎన్‌టిఆర్ శత జయంతోత్సవాలో పాల్గొననున్నట్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ శతజయంతిని ప్రవాసాంధ్రులు అన్నిదేశాల్లో పెద్ద ఎత్తున నిర్వహించడం అనందంగా ఉందన్నారు. దుబాయిలో ఈ నెల 20న శనివారం వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారని తెలిపారు.

టిడిపి 'మహానాడు' వసతి కమిటీ సమీక్ష

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడుకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే వారికి వసతి సౌకర్యాల కల్పనపై ఆ పార్టీ నాయకులు సమాలోచనలు జరిపారు. మోరంపూడి సెంటర్‌లోని గన్నీస్ శుభమస్తు ఫంక్షన్ హాల్లో మహానాడు వసతి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అధ్యక్షులు కె.ఎస్.జవహర్, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎంఎల్‌ఎలు బండారు సత్యానందరావు, గన్ని వీరాంజనేయులు, బూరుగుపల్లి శేషారావు, మాజీ జెడ్‌పి చైర్మన్ జ్యోతుల నవీన్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు యర్రా వేణుగోపాలరాయుడు, ఆదిరెడ్డి వాసు, మన్నవ మోహనకష్ణ, చిట్టాబత్తిన చిట్టిబాబు, వీరంకి వెంకట గురుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజమహేంద్రవరం వేదికగా చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉండే ఫంక్షన్ హాల్స్, హోటల్స్, ఇతర స్థలాలను పరిశీలనలోకి తెచ్చారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు మార్గాని సత్యనారాయణ, ఆళ్ళ ఆనందరావు, బాబూ ఖాన్, జక్కంపూడి అర్జున్, వాసిరెడ్డి బాబి, కోరుమెల్లి విజయశేఖర్ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు

వృద్ధురాలి ఆచూకీ కోసం విజ్ఞప్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మూడు రోజులుగా స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం వద్ద ఉన్న ఒక వృద్ధురాలి ఆచూకీ కోసం ఆమె కుటుంబ సభ్యులు సంప్రదించాలని స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు గుబ్బల రాంబాబు కోరారు. ఒక ఆటో డ్రైవర్ మానవతా దక్పథంతో స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం దగ్గర ఆమెను దించి వెళ్లిపోయినట్టు తెలిపారు. రాజవొమ్మంగి మండలం అమీనాబాద్‌కు చెందిన పచుకుల చంద్రకాంతం అని ఆమె ఆధార్ కార్డు వివరాల ద్వారా తెలుస్తోందన్నారు. తన వృద్ధాప్యం వల్ల అయిన వారికి భారంగా మారానని ఇలా రోడ్డున వదిలేయడం ఎంతో బాధను కలిగిస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రకాంతం కోసం స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమాన్ని స్వయంగా లేదా 9849847489 ఫోన్‌లో సంప్రదించాలని రాంబాబు తెలిపారు. కుటుంబ సభ్యులు ఎవరికైనా వృద్ధులు భారంగా ఉంటే దయచేసి వృద్ధాశ్రమ నిర్వాహకులను సంప్రదించి వారిని ఒప్పించి చేర్పించే ప్రయత్నం చేయాలి కానీ ఇలా రోడ్డున వదిలేయవద్దని రాంబాబు విజ్ఞప్తి చేశారు.

వృద్ధురాలితో స్వర్ణాంధ్ర రాంబాబు

కార్టూ'నిజం'



రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-గోకవరం

రైతుల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు ఆదేశించారు. ఎంపిడిఒ కెవిఎస్ఎస్ఎస్.మూర్తి ఆధ్వర్యంలో ఎంపిపి సుంకర శ్రీవల్లి వీరబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులతో వ్యవసాయ శాఖ అధికారులు సమావేశలు నిర్వహించి వ్యవసాయంపై తీసుకోవాల్సిన సలహాలు సూచనలు, రైతులకు అందజేయడం లేదని ఎంపిటిసిలు తెలిపారు. తడిసిన మొక్కజొన్న తీసుకుంటామని అధికారులు చెబుతున్నప్పటికీ నాణ్యత గల మొక్కజొన్న మాత్రమే కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నారన్నారు. 1156 వరి వంగడంతో పండించిన పంటను అధికారులు తీసుకోవడం లేదని, పండించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించినప్పుడు వాహనాలకు రవాణా ఖర్చులు ఇవ్వడం లేదని తెలిపారు. ఇటీవల జరిగిన భూములపై రీ సర్వే సక్రమంగా జరిగినట్లు రైతులకు ఎటువంటి దవపత్రాలు ఇవ్వడం లేదన్నారు ఈ విషయమై రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ భూసర్వే పూర్తయిన రెండు రోజుల్లో సర్వే కాగితాలు రైతులకు అందజేస్తామన్నారు. పశు వైద్యాధికారి మాట్లాడుతూ పశువులకు కూడా ఎమర్జెన్సీ సర్వీస్ ఉందని రైతులు ఎవరైనా 1962 నెంబర్‌కు ఫోన్ చేసినట్లయితే ఎమర్జెన్సీ వాహనంతో సిబ్బంది వచ్చి పశువులకు చికిత్స చేస్తారని తెలిపారు.

పొగాకు బోర్డుకు ఆర్‌ఒ ప్లాంట్ అందజేత

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురం పొగాకు బోర్డుకు మినీ ఆర్‌ఒ వాటర్ ప్లాంట్‌ను పిన్నమనేని గోపాలకష్ణ రావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు బుధవారం అందజేశారు. గుంటూరు పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు ప్లాంట్‌న బుధవారం ప్రారంభించారు. ఈ ప్లాంట్‌ను రీజనల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య, వేలం నిర్వహణాధికారి డి.శామ్ ఆధ్వర్యంలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం శ్రీధర్‌బాబు పొగాకు వేలం కేంద్రంలో కొనుగోళ్లను పరిశీలించారు. రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ వర్జీనియా పొగాకుకొనుగోళ్ల ప్రక్రియ వేలం కేంద్రంలో ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. వేసవికాలంలో రైతులు గోపాలపురం పరిసర ప్రాంతాల నుండి బేళ్ళను పొగాకు బోర్డుకు తరలిస్తారని అన్నారు. మంచినీటి కొరత అధికంగా ఉండడంతో రైతులు యొక్క ఇబ్బందులను గమనించి వారి దాహార్తిని తీర్చేందుకు వర్జినయ పొగాకు రైతులు సంక్షేమ సంఘం అధ్యక్షులు మధుమోహన్ వారి కుటుంబ సభ్యులు మినీ వాటర్ ప్లాంట్ బహుకరించడం పట్ల వారి కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పొగాకు బోర్డు సెక్రటరీ డి.వేణుగోపాల్, విల్లూరి రాంబాబు, దుగ్గిరాల రాంబాబు, గద్దె శేషగిరిరావు, కరటంరెడ్డి బాబు, పరిమి జగదీష్, కాకర్ల వివేకానంద, ఎస్‌జిఒ హేమస్మిత, కూసం రామ్మోహన్ రెడ్డి, ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరం గ్రామ శివారులో బ్రహ్మల కాలనీ వద్ద నూతన రోడ్డు నిర్మాణానికి బుధవారం జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊర కాలవ ఉధతికి బ్రహ్మల కాలనీ రోడ్డు కోతకు గురై శిథిలావస్థకు చేరిందన్నారు. ఈ రహదారి స్థానంలో రూ.5 లక్షల వ్యయంతో నూతనంగా సిమెంట్ రోడ్ నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర శ్రీవల్లి వీరబాబు వైస్ ఎంపీపీ మడికి మైనర్ బాబు, నాయకులు వరసాల ప్రసాద్, ఎంపిటిసి తోలేటి రమ్య, శ్రీప్రసాద్ నరసయ్య పాల్గొన్నారు.

న్యాయ సేవలపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రజలు, మహిళలు, బాలలకు అందుబాటులో ఉన్న న్యాయ సేవలు గురించి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి వివరించారు. బాలలు, మహిళల పై ఎలాంటి అరాచకాలూ జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. బాలల సంరక్షణ కోసం నల్సా వారి 'చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ స్కీమ్' గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇతరులకు ఇబ్బంది లేదా హాని కలిగే పనులు చేయరాదని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న న్యాయ సేవల గురించి వివరించారు.

14 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి-తాళ్లపూడి

తాళ్లపూడి కొవ్వూరు మండలాలకు చెందిన 14 మంది పేదలకు రాజేశ్వరి రామకష్ణ లయన్స్ కంటి ఆసుపత్రితో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తున్నట్టు దేవోక్తి చిడిపి సోషల్ సర్వీస్ అధినేత ప్రత్తిపాటి అబెద్నెగో తెలిపారు. లయన్స్ ఆసుపత్రి వారిచే తాళ్లపూడిలో నిరంతరం కొనసాగుతున్న ఉచిత కంటి పరీక్షా కేంద్రంలో 14 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నాగరాజు ఈశ్వర్ సోషల్ సర్వీస్ సభ్యులు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కోసం చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదు కావడంతో కార్పొరేషన్ అధికారులు ఉపశమనం కలిగించేందుకు చర్యలు చేపట్టారు. నగరంలో పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసిన విషయం విదితమే. తాజాగా రోడ్లపై నీళు చల్లేలా క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. అందువల్ల రోడ్లన్నీ విపరీతమైన వేడిని వెదజల్లుతున్నాయి. ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు అన్ని ప్రధాన రహదార్లను, ముఖ్యమైన కూడళ్ళను నీటితో తడుపుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలు తగ్గేదాకా ఈ కార్యక్రమం కొనసాగుతుందని కమిషనర్ తెలిపారు.

19న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ నెల 19న సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం రాజానగరం విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. రాజానగరం మండలం రాజానగరం, తూర్పుగానుగూడె, పల్లకడియం, రామస్వామి పేట గ్రామాలకు, 33/11 కెవి రాజానగరం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని తెలిపారు.

నేరాలు ఘోరాలు

కెనాల్ రోడ్డులో బోల్తా పడిన ధాన్యం లోడు ట్రాక్టర్

ధాన్యం ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట కాకినాడ ప్రధాన రహదారి కెనాల్ రోడ్డులో బుధవారం ధాన్యం లోడుతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ట్రాక్టర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి ట్రాఫిక్ ఎస్.ఐ అడపా గరగరావు సిబ్బందితో చేరుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

బైకును ఢీకొన్న ట్రాక్టర్
ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కాజులూరు

గొల్లపాలెంలో కాకినాడ - కోటిపల్లి రహదారిలో జరిగిన ప్రమాదంలో నామా సత్యనారాయణ తీవ్రంగా గాయపడినట్టు స్థానికులు గొల్లపాలెం పోలీసులు తెలిపారు. కాకినాడ రూరల్ ఎంపిఒగా పనిచేస్తున్న నామా సత్యనారాయణ స్వగ్రామం కాజులూరు వస్తుండగా గొల్లపాలెం శ్రీ రామ నర్సింగ్ హోమ్ మలుపులో కాకినాడ నుండి ద్రాక్షారామం వెళ్తున్న ట్రాక్టర్ వేగంగా వెనుక నుండి ఢీకొనడంతో సత్యనారాయణకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు పక్కనే ఉన్న ఆసుపత్రికి తరలించారు. కేసును గొల్లపాలెం ఎస్ఐ. తులసీ రామ్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

కొత్తపల్లి పాత తహశీల్దార్ కార్యాలయం సమీపంలో పిచ్చి కుక్క ఇద్దరిపై బుధవారం దాడి చేసింది. ఈ దాడిలో గ్రామానికి చెందిన బాలుడు బొజ్జ మణికంఠ, సానా గోపాలం పిచ్చికుక్క దాడిలో తీవ్ర గాయాల పాలయ్యారు. మణికంఠ స్థానిక కొత్తపల్లి పిహెచ్ సి కి తరలించగా అక్కడ చికిత్స అనంతరం, మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ పై తరలించారు.గోపాలం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు జైలు

ప్రజాశక్తి-కడియం

భార్య మృతికి కారణమైన భర్తకు కోర్టు రూ.2వేల జరిమానాతో పాటు రెండేళ్ల జైలు శిక్ష విధించి పాములమెట్ట గ్రామానికి చెందిన ఉర్ల సురేష్ తన భార్య ఎస్తేరు రాణి ని వేధించాడు. మనస్థాపం చెందిన ఆమె 2019లో జేగురుపాడు కాలువ వంతెన పై నుంచి గోదావరి కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. అప్పటి సిఐ బివి.సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టులో హాజరు పరచగా కోర్టు పై తెలిపిన విధంగా జరిమానా, జైలు శిక్ష విధించిందని పోలీసులు తెలిపారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గోపాలపురం

పశవులను చెరువులో నుంచి పైకి తోలే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని గుడ్డిగూడెంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. గుడ్డిగూడెంకు చెందిన ముప్పిడి శ్రీను వత్తి రీత్యా కూలి పని చేస్తూ, తనకున్న పశువులను మేపుకుంటూ జీవిస్తాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం పనికి వెళ్లి వచ్చి అనంతరం తన పాక వద్ద ఉన్న పశువుల మేతకు తోలుకు వెళ్లాడుప. ఈ క్రమంలో పశువులు పానకాల చెరువులోకి దిగి ఎండకు పైకి రాకపోవడంతో వాటిని మేతకు తోలేందుకు శ్రీను చెరువులోకి దిగాడు. ఈ క్రమంలో చెరువులో మునిగిపోయాడు. చుట్టుపక్కల వారు చూసి అతనిని పైకి తీసినప్పటికే శ్రీను మతి చెందినట్లు తెలిపారు. భార్య రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.రామకృష్ణ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, శవ పంచనామా నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రుకి తరలించినట్లు తెలిపారు. మృతునికి ఇద్దరు పిల్లలుగా ఒకరికి వివాహమైనట్లు తెలిపారు.

సమావేశం లో మాట్లాడుతున్న వైద్యురాలు గౌతమి

వడదెబ్బ నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి
రాజపుడి పీహెచ్ సి డాక్టర్ గౌతమి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

వేసవి కాలంలో ఎండలు ఎక్కువగా ఉండుట వలన వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజలు వడదెబ్బకు గురి అయ్యే ప్రమాదం వుందని రాజ పూడి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్. కె.గౌతమి తెలియజేశారు. గురువారం మండలంలోని రాజపూడి పిహెచ్‌సిలో ఆరోగ్య సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి తగు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్గించాలని ఆదేశిం చారు. ఎండ తీవ్రత వల్ల శరీర ఉష్ణోగ్రత కూడా 104.9 డిగ్రీల వరకు పెరిగి మెదడు మీద ప్రభావం చూపుతుందనీ, దీనివలన మెదడులోని ఉష్ణోగ్రత ను నియంత్రించే కేంద్రం (హైపో థలామస్) దెబ్బతిని వడదెబ్బకు గురి అవుతారన్నారు. ఎండలో తిరగటం వలన వేడిమికి చెమట పట్టి శరీరంలోని లవణాలు, నీటి శాతం తగ్గి డీ-హైడ్రేషన్‌కు గురి అవుతారనీ ఇది ప్రమాదకరం, ప్రాణాంతకమని తెలిపారు.

యానాం వార్తలు

విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న ఎంఎల్ఎ అశోక్

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థినీవిద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత సైకిల్స్ లను బుధవారం ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉచిత సైకిళ్ల పంపిణీ చేయడానికి ప్రభుత్వం 339 సైకిళ్ల మంజూరు చేసిందని వాటిని విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఉచిత సైకిళ్ల అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈఏడాది యానాం నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సిబిఎస్ఇ సిలబస్‌ను ప్రభుత్వం అమలు చేయనున్న దృష్ట్యా విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా నాణ్యమైన విద్య బోధించేలా ఉపాధ్యాయులు సంసిద్ధులై ఉండాలని, విద్యార్థులు కూడా ప్రభుత్వ సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గిరియాంపేట పెరంత లైవార్ కామరాజర్ హైస్కూల్‌లో-65 సైకిళ్ల దరియాలతిప్ప హైసూల్ లో-28 సైకిల్స్, శారదాప్రభుత్వ ఎయిడెడ్ స్కూల్-72 సైకిళ్ల, రెయిన్ కోట్‌లను విద్యార్థిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి,విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, హెచ్‌ఎంలు దంగేటి త్రిమూర్తులు, సికె పద్మశ్రీ,చిక్కాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరియాంపేట తాగునీటి సమస్యపై ఎంఎల్ఎకు ఫిర్యాదు

గిరియాంపేట వీధుల్లో తాగునీటి సరిగ్గా అందడం లేదని స్థానికులు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కు బుధవారం పిర్యాదు చేశారు.దీనికి స్పందించిన ఆయన సంబంధిత పిడబ్ల్యుడి అధికారులతో మాట్లాడారు. వేసవికాలంలో తాగునీటి సమస్యలు రాకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆ భూమిని దేవస్థానానికి రాసివ్వలేదు

యానాం శివారు అడవి పొలంలోని తమకు చెందిన భూమిని దేవస్థానానికి రాసి ఇవ్వలేదని కసిరెడ్డి బ్రహ్మానందం కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు పరిపాలనాధికారి మునుస్వామికి, డిటీ సత్య నారాయణకు కసిరెడ్డి శేషాయమ్మ తదితరుల సంతకాలతో వినతిపత్రం అందించారు. దేవస్థానం భూమి అని కొంతమంది ఇస్తున్న ఫిర్యాదులు వాస్తవం కాదని తెలిపారు.

సత్యం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దొరబాబు

దొరబాబు పరామర్శ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నువ్వుల గుంట వీధి సచివాల కన్వీనర్ కొత్తపల్లి సత్యం మాతమూర్తి పాపయమ్మ ఇటీవల మతి చెందడంతో సత్యం కుటుంబ సభ్యులను బుధవారం వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ దవులూరి దొరబాబు పరామర్శించారు. ఆయన వెంట వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్,ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ,కౌన్సిలర్ విడదాసరి రాజా,కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ,వైసిపి నాయకులు బొడ్డు ప్రకాష్,తాటికొండ పెదకాపు ఉన్నారు.

మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత
- దిశ పోలీస్ స్టేషన్లలో ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ జిల్లా ఎస్‌పి ఎస్. సతీష్‌కుమార్ కాకినాడ నగరంలోని జిల్లా దిశ మహిళా పోలీస్ స్టేషన్లను బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దిశా పోలీస్ స్టేషన్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, బాధిత మహిళలు, బాలికల సమస్యలపై స్టేషన్ సిబ్బంది వ్యవహరించే పని తీరును ఎస్‌పికి దిశ పోలీస్ స్టేషన్ డిఎస్‌పి జయరాం ప్రసాద్ వివరించారు. అనంతరం ఎస్‌పి సతీష్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు, బాలికల ఫిర్యాదు లపై తక్షణం స్పందించి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలతో న్యాయ స్థానాల ద్వారా వారికి కఠిన శిక్షలు పడేలా దిశ సిబ్బంది కృషి చేయాలని. పాఠశాలలు, కళాశాలలకు వెళుతున్న బాలికలు, యువతుల భద్రతకై పోలీసు శాఖ ద్వారా అమల్లో ఉన్న సేవలు, దిశా, ఫోక్సో చట్టాలు, ఈవ్‌టీజింగ్, ఎల్లో ప్మెంట్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు మొదలగు అంశాలపై మహిళా పోలీసుల యొక్క సేవలను ఉపయోగించుకుని విరివిగా అవగా హన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్‌పి దిశ సిబ్బందిని ఆదేశించారు. దిశా పోలీస్ స్టేషన్‌కు అనుబంధంగా ఉండే ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్, కాకినాడ జిజిహెచ్ ఆవరణలో ఉన్న దిశా వన్ స్టాప్ సెంటర్‌ను ఎస్పీ సందర్శించి ఈ కేంద్రాల యొక్క పనితీరును అక్కడి సిబ్బందితో మాట్లాడి మహిళలు, బాలికల రక్షణ విషయంలో మరింత మెరుగైన సేవలు అందించాలనారు. అనంతరం నిర్మాణంలో ఉన్న దిశా పోలీస్ స్టేషన్ భవనాన్ని, దిశా వన్ స్టాప్ సెంటర్ పక్కా భవన నిర్మాణాన్ని పరిశీలించి తక్కువ కాల వ్యవధిలో రెండూ నిర్మాణం పూర్తిచేసుకుని అందుబాటులోకి వచ్చేలా రోజువారీ జరుగుతున్న పనులను పర్యవేక్షించాలని దిశ డిఎస్‌పిని ఎస్‌పి సతీష్‌కుమార్ ఆదేశించారు. ఆయన వెంట దిశా స్టేషన్ పోలీసు అధికారుచలు సిబ్బంది, ఐసిడిఎస్ పీడీ ప్రవీణ, లీగల్, వైద్య విభాగాల అధికారులు పాల్గొన్నారు.

దిశ పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌పి సతీష్‌కుమార్

కాకినాడ కార్పొరేషన్ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మహేష్‌కుమార్

20 నుంచి మేరీ లైఫ్... మేరా స్వచ్ఛ షహర్

పాత వస్తువుల సేకరణకు 14 కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మేరీ లైఫ్.. మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ ఆర్. మహేష్‌కుమార్ చెప్పారు. కాకినాడ స్మార్ట్ సిటీ సమావేశం మందిరంలో అధికారులతో కమిషనర్ చర్చించారు. పాత వస్తువుల సేకరణ కోసం కాకినాడ నగరంలోనికాకినాడ నగరంలోని బోట్ క్లబ్ పార్క్, జన్మభూమి పార్క్, సాంబమూర్తి నగర్ లోని లైబ్రరీ బిల్డింగ్ అంబేద్కర్ పార్క్, ఎంజి స్కూల్ ఎదురుగా మాస్టర్ కార్యాలయం, ఏటిమొగ వెహికల్ యార్డ్, జగన్నాధపురం పాత ఈసేవ బిల్డింగ్, ముగ్గుపేట కమ్యూనిటీ హాల్, జ్యోతుల మార్కెట్ ఈ వేస్ట్ సెంటర్, పాత కార్పొరేషన్ కార్యాలయం, కొత్తపేట చిన్న మార్కెట్ వద్ద గల కమ్యూనిటీ హాల్, వార్ఫ్ రోడ్ కమ్యూనిటీ హాల్, బాల భవన్ వద్ద మాస్టర్ ఆఫీస్, వివేకానంద పార్క్, శ్రీనివాస బ్యాంక్ కాలనీ షెడ్ వద్ద ఈ నెల 20వ తేదీ నుండి జూన్ 5వ తేదీ వరకు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పాత వస్తువులను సేకరించనున్నట్టు తెలిపారు. కార్యక్రమాన్ని పర్యవేక్షిం చేందుకు నోడల్ అధికారులను కూడా నియమించినట్టు కమిషనర్ మహేష్‌కుమార్ తెలిపారు. ఎడిసి నాగ నరసింహారావు మాట్లాడుతూ రెడ్యూస్- రీ సైకిల్ -రీ యూజ్ నినాదంతో చేపడుతున్న కార్యక్రమానికి ప్రజలు కూడా తమ వంతు సహకారించాలని కోరారు. సమావేశంలో డిఇ మాధవీ, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, టిపిఆర్ఒ మానే కృష్ణమోహన్, కార్పొరేషన్ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. **పెద్దాపురం** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నెల 21వ తేదీ నుండి జూన్ 4వ తేదీ వరకు ప్రతి సచివాలయం పరిధిలో పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు, కాగితాలు, అట్టలు పుస్తకాలు, బట్టలు, బూట్లు, చెప్పులు సేకరించాలని మున్సిపల్ కమిషనర్ జె సురేంద్ర తెలిపారు. మేరా లైఫ్ -మేరా స్వచ్ఛ షహర్‌లో భాగంగా రెడ్యూస్ - రీసైకిల్ - రీ యూజ్ (ఆర్ ఆర్ ఆర్) పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తు న్నామన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసే స్టాల్స్ వద్ద ప్రజలు తమకు పనికిరాని వస్తువులను అందజేయా లన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనే విధంగా మెప్మా, మున్సిపల్ సిబ్బంది, మహిళలు పట్టణ పరిధిలో బుధవారం నుండి ప్రదర్శనలు, కరపత్రాలు, బ్యానర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారన్నారు. ప్రజలందరూ పాల్గొని త్రిపుల్ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పెద్దాపురంలో త్రిపుల్ ఆర్ పై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ సురేంద్ర

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- గ్రామాల్లో పోలీసుల అవగాహనా సదస్సులు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ ఐపిఎస్ ఆదేశాల మేరకు మండలంలోని కాండ్రేగుల, గోళ్ళలగుంట గ్రామాల్లో జగ్గంపేట సిఐ బి.సూర్య అప్పారావు ఆధ్వర్యంలో జగ్గంపేట ఎస్ఐ విద్యాసాగర్ గ్రామ ప్రజలకు బుధవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సూర్య అప్పారావు మాట్లాడుతూ తాగి మోటార్ సైకిల్ నడపకూడదని, ప్రతి ఒక్కరికి లైసెన్స్ కలిగి ఉండాలని అదేవిదంగా వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి సమయంలో ఆరు బయట లేదా మేడపైన నిద్రించేవారు ఇళ్లకు తాళాలు పటిష్టంగా వేసుకోవాలని, విలువైన వస్తువులు ఒంటిపై ధరించరాదన్నారు. ముఖ్యంగా వేసవి సెలవులకు, వివాహాది శుభకార్యాలకు ఇల్లు విడిచి కుటుంబ సమేతంగా వెళ్లేవారు ముందుగా జగ్గంపేట స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. అదేవిధంగా విలువైన వస్తువులు ఉంటే వాటిని బ్యాంకులో లాకర్స్‌లో భద్రపరుచుకోవాలని కోరారు. ముఖ్యంగా కాలనీలో నిషేధిత పదార్థాలైన గంజాయి, సారా అమ్మకాలు తయారీ వంటి వాటికి పాల్పడితే తక్షణం పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామస్తుల్లో నుంచి ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు మొత్తం ఐదుగురితో పీస్ కమిటీ ఏర్పాటు చేశారు. వీరు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. జగ్గంపేట ఎస్ఐ సిహెచ్ విద్యాసాగర్ మాట్లాడుతూ ఎవరైనా సారా అమ్మినా, తయారుచేసినా చట్టరీత్యా నేరం అని అలాంటి వాళ్లు ఎవరైనా ఉంటే నాకు సమాచారం ఇవ్వాలని, మీకు ఏ సమస్య అయినా ఉంటే మీకు అందుబాటులో మహిళా పోలీస్ ఉంటారని వాళ్లకు తెలియచేయాలని సూచించారు.

ప్రజలతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

ప్రమాద ఘటన స్థలంలో సీతారాంపురం వైపు ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్

తాళ్లరేవు ప్రమాద ఘటనా స్థలంలో
యుద్ధ ప్రాతిపదికన స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

ప్రజాశక్తి - తాళ్లరేవు

జాతీయ రహదారి 216 పై తాళ్లరేవులో ఈనెల 14వ తేదీ ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మతిచెందడంతో అధికారులు అప్రమత్త మయ్యారు. నేషనల్ హైవే అధికారులు పోలీసు శాఖ సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేశారు.జాతీయ రహదారి నుంచి గ్రామీణ ప్రాంత రహదారులకు అనుసంధానంగా ఉన్న కోరంగి పంచాయతీ ఘటన ప్రాంతంలో చిన్న బొడ్డు వెంకటరాయపాలెం, సీతారామపురం వెళ్లే రహదారులకు బ్రేకర్లు నిర్మించారు. అదేవిధంగా చొల్లంగి, జి.వేమవరం, పటవల, పోలేకురు, తాళ్ళరేవు రహదారులకు స్పీడ్ బ్రేకర్లను నిర్మించారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రామకృష్ణ సత్కరిస్తున్న మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

గండేపల్లి మండల తెలుగు యువత అధ్యక్షునిగా రామకృష్ణ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన కుంచే రామకృష్ణ మండల యువత అధ్యక్షుడిగా నియమితులయ్యారు ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ స్వగృహంలో గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన కుంచే రామకృష్ణను గండేపల్లి మండల తెలుగు యువత అధ్యక్షుడిగా ప్రకటించిన రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ రామకృష్ణను పార్టీ కండువాతో రామకృష్ణను సత్కరించగా, పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. తనను మండల తెలుగు యువత అధ్యక్షుడిగా నియమించినందుకు వారికి కతజ్ఞతలు తెలియజేసి, పార్టీ ప్రతిష్ట కోసం కష్టపడి పనిచేస్తానని రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో లచ్చయ్య దొర మండల పార్టీ అధ్యక్షులు పోతుల మోహనరావు, కాకినాడ జిల్లా టిడిపి క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు కన్నబాబు, మారిశెట్టి భద్రం, జంపన సీతారామచంద్ర వర్మ, పాలచర్ల సత్యనారాయణ, బదిరెడ్డి అచ్చన్న దొర, మండపాక అప్పన్న దొర, బోదిరెడ్ల సుబ్బారావు, మలిరెడ్డి వెంకట శ్రీధర్ (సిరి) గల్లా రాంబాబు గోరిజాల వెంకన్న దొర, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఆల్ క్యాస్ట్ యూనియన్ అధ్యక్షునిగా వెంకటరెడ్డి

ప్రజాశక్తి - ఆలమూరు

జొన్నాడకు చెందిన ఆల్ క్యాస్ట్ కార్మికుల యూనియన్ అధ్యక్షులుగా రెండోసారి తాడి వెంకట కృష్ణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే బుధవారం జరగవలసిన ఎన్నికల నియామకంలో భాగంగా రాజమహేంద్రవరం డివిజనల్ కో-ఆపరేటివ్ కార్యాలయం నుండి వచ్చిన ఏమ్.రామభక్తుడు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తూ ఉండగా వారి సమక్షంలో యూనియన్ సభ్యులు వెంకటరెడ్డిని అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పరమటి వెంకట్రావు, కార్యదర్శిగా లంక రాజును ఎన్నుకోగా పదవి బాధ్యతలు ఐదు సంవత్సరాలు కొనసాగనున్నట్లు ఎన్నికల అధికారి తెలియజేశారు. ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ మాపై నమ్మకం ఉంచి ఆల్ క్యాస్ట్ కార్మికుల యూనియన్ బాధ్యతలు అప్పగించినందుకుగాను ధన్యవాదాలని తెలియజేశారు. యూనియన్ మరింత బలోపేతానికి కషి చేస్తామని వారు అన్నారు. అనంతరం ఎన్నికైన సభ్యులను పలువురు అభినందించారు.కార్యక్రమంలో యూనియన్ నెంబర్లు నాగిరెడ్డి ఆదినారాయణ, వీరి గోవిందు, కర్రి సురేష్, గుత్తుల ఏడుకొండలు, గెద్దాడ సత్యనారాయణ, వేల్పూరి రామకష్ణ, తదితర సభ్యులు పాల్గొన్నారు.

ఎగసిపడుతున్న అలలు
కోతకు గురవుతున్న బీచ్ రోడ్డు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

ఉప్పాడ సముద్ర తీరం ఒక్కసారిగా మార్పు చెందడంతో బుధవారం ఎగసిపడుతున్న అలల తాకిడికి ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్డు కోతకు గురవుతోంది. ఉధృతమైన అలల తాకిడికి రక్షణగా వేసిన రాళ్లు బీచ్ రోడ్డుపైకి చేరడంతో పాటు, అటుగా వెళ్లే వాహనదారులు తడిసిపోవాల్సి వస్తోంది. దీంతో కాకినాడ చేరు కోవాలంటే ఉప్పాడ, కొనపపేట, మూలపేట, తదితర గ్రామాలకు పిఠా పురం మీదగా వెళ్లాల్సి వస్తుందని పలువురు తెలిపారు. శుక్రవారం అమా వాస్య కావడంతో అలలు ఇంకా ఎగసిపడతాయని మత్స్యకారులు తెలిపారు.

ధ్వంసమవుతున్న బీచ్ రోడ్డు

కొండపై ఓ సన్నివేశంలో విజయ్ దేవరకొండ మురళి శర్మ శరణ్య లకు సన్నివేశంపై వివరిస్తునన దర్శకుడు శివ

రత్నగిరిపై ముగిసిన ఖుషి సినిమా సందడి

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం దేవస్థానం రత్నగిరి కొండ పైన మంగళవారం నుండి ప్రారంభమైన ఖుషి సినిమా షూటింగ్ సందడి బుధవారం సాయంత్రంతో ముగిసింది. మైత్రి మూవీస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమాలో సత్యదేవుని కళ్యాణ ఉత్సవాల ఘట్టాలు సంబంధించిన సన్నివేశాలను దర్శకుడు శివ చిత్రీకరిం చారు. విజయ్ దేవరకొండ, సమంత హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాలో మురళీశర్మ, శరణ్య తదితర నటీనటులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను నిషేధించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ ను నిషేధించాలని కోరంగి రేంజర్ దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం కోరంగి, దిండి గ్రామాల్లో ప్లాస్టిక్‌ను ఉపయోగించడం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో ఉన్న ప్లాస్టిక్ పోగుచేసి దగ్ధం చేయించారు. ఈ సందర్భంగా కోరంగి రేంజర్ దుర్గాప్రసాద్ ఎపి అటవీశాఖ లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ కార్యక్రమంలో భాగంగా వైల్డ్ లైఫ్ రేంజ్ కోరింగ, కాకినాడ డివిజన్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై జూన్ 5వ తేదీ వరకు తాళ్లరేవు మండలం లోని పలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోరంగి ఉపసర్పంచ్ కామారెడ్డి భైరవమూర్తి, ఎఫ్ ఎస్ఓలు నాగార్జున, వీరభద్రరావు, ఎఫ్‌బిఓలు మహేష్, ధనుంజయారావు,. గోపీ నాగేంద్ర కుమార్, సుబాని, వరలక్ష్మి, ధనలక్ష్మి, శ్రీప్రియ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై వివరిస్తున్న అటవీ శాఖ అధికారులు

మహిళ హత్య కేసులో దర్యాప్తు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండల కేంద్రం ఆత్రేయపురం దళిత చిన్న పేటలో జరిగిన నక్కా మహాలక్ష్మి హత్య కేసులో బుధవారం రాత్రి కొత్తపేట డిఎస్‌పి కె. వెంకటరమణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు హత్య జరిగిన ప్రదేశంలో స్థానిక ఎస్ఐ సిహెచ్.సుధాకర్ తో కలిసి స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు స్థానికులు మాట్లాడుతూ మహాలక్ష్మి హత్య చేసిన నిందితులను త్వరగా పట్టుకుని న్యాయం చేయాలన్నారు. స్థానిక పోలీసులు కేసుని నీరు కార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. డిఎస్‌పి మాట్లాడుతూ మహాలక్ష్మి హత్య కేసు దర్యాప్తు వేగవంతంచేస్తామన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న డిఎస్‌పి

CHANGE OF NAME

My Old Name is PALLA SIVA. My New Name is PALLA SURESH KUMAR, S/o. Palla Nukaraju, D.No. 29-5-8, Surya Palace Road, Lakshmivarapu peta, Rajamahendravaram - 533104 (Cell No. 99664 87327). Since today onwards I am calling as **PALLA SURESH KUMAR** (New Name).

ఇంటి స్థలం దస్తావేజులు పడిపోయినవి

గోపాలపురం మండలం, గోపాలపురం గ్రామానికి చెందిన షేక్ చాందిని, W/o. షేక్ మొహిద్దీన్ కు గోపాలపురం రెవిన్యూ పరిధిలో **డాక్యుమెంట్ నెంబరు 629/1991**లో 4 సెంట్లు ఖాళీ స్థలం కలదు. ది. 10-5-2023న మేము ఇల్లు మారుచుండగా పడిపోయినవి. దొరికినవారు ఈ అడ్రసుకు, ఫోన్ నెంబరుకు తెలియచేయవలసిందిగా కోరుచున్నాను.

షేక్ చాందిని
W/o. షేక్ మొహిద్దీన్, గోపాలపురం,
గోపాలపురం మండలం, తూ॥గో॥జిల్లా
సెల్: 9505032354

దస్తావేజులు పడిపోయినవి

తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి మండలం, మహేంద్రవాడ గ్రామం, డోర్ నెం. 10-158 కాపురస్తులయిన సబ్బెళ్ళ వీర వెంకట సత్యనారాయణరెడ్డి, W/o. శ్రీమతి గంగాలక్ష్మి చెందిన **దస్తావేజులు సర్వే నెం. 783/2011, 743/2011, 744/2011,** ది. 04-05-2023వ తేదీన పిఠాపురం నుండి కాకినాడ రూరల్ మండలం, తిమ్మాపురం వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈ అడ్రస్ నందు సంప్రదించవలెను.

సబ్బెళ్ళ గంగాలక్ష్మి, W/o. సత్యనారాయణరెడ్డి
డోర్ నెం. 10-158, తోట వీధి,
మహేంద్రవాడ, అనపర్తి మండలం
తూర్పుగోదావరి జిల్లా

కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అధారిటీ

ప్రకటన

కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అధారిటీ (పూర్వపు గుడా) వారు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము, కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, తమ్మవరం గ్రామం, సూర్యారావుపేటలోని సర్వే నెం. 331 నందు 12,140.60 చ॥మీ॥ల విస్తీర్ణంలో బీచ్ పార్కు ప్రాజెక్ట్ నిర్మాణపు ప్రతిపాదనల కొరకు కేంద్ర పర్యావరణ అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వారి నుండి సి.ఆర్.జెడ్ అనుమతులు ఫైల్ నెం. 11/4/2022-IA.III, తేది: 19-4-2023 ద్వారా పొందియున్నారు. సదరు అనుమతుల కాపీలు కేంద్ర పర్యావరణ అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వారి వెబ్‌సైట్ నందు అందుబాటులో ఉన్నాయి.

సం/- **వైస్-ఛైర్మన్**
కావుడా, కాకినాడ

పురపాలక సంఘం - అమలాపురం

ఆర్.ఓ.సి. నెం. 758/2020-ఇ1 తేది: 17-05-2023

ఇ-ప్రొక్యూర్‌మెంటు షార్టు టెండరు నోటీసు

అమలాపురం పురపాలక సంఘ పరిధిలో సాధారణ నిధులతో నలభై ఏడు (47) పనులకు రూ. 234.90 లక్షలతో మరియు 15వ ఆర్థిక సంఘ నిధులతో రెండు పనులకు రూ. 35.79 లక్షలతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.

టెండరు షెడ్యూల్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేది: 15-05-2023 సా॥ 07.00ల నుండి
ముగింపు తేది: 01-06-2023 సా॥ 04.00ల వరకు

మిగిలిన వివరములు www.tender.apeprocurement.gov.in వెబ్‌సైట్ నందు చూడగలరు.

సం/- **కమిషనరు**
అమలాపురం పురపాలక సంఘం